# ఆధ్యాత్మికతే భారతదేశ బలం

- **దురదృష్టవశాత్తు మతంతో ముడిపెడుతున్నారు**
- **ఆధ్యాత్మిక ప్రయాణానికి యోగా తొలి అడుగు: మోదీ**

న్యూఢిల్లీ, మార్చి 7: ఆధ్యాత్మికతే భారతదేశ బలమని, కానీ, దురదృష్టవశాత్తు చాలామంది దీనిని మతంతో ముడిపెడుతున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఆధ్యాత్మికత, మతం రెండూ వేర్వేరని చెప్పారు. ఆధ్యాత్మిక ప్రయాణానికి మొదటి అడుగు యోగా అని తెలిపారు. యోగోదా సత్సంగ్ సొసైటీ ఆఫ్ ఇండియా (వైఎస్ఎస్) శతవార్షికోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జనాబా, జీడీపీ లేదా ఉద్యోగిత రేటును ఆధారంగా చేసుకుని ప్రపంచం భారతదేశాన్ని పోలుస్తోందని, కానీ, ఆధ్యాత్మిక భారత్ గురించి మిగిలిన ప్రపంచానికి తెలియదని, అది గుర్తించనూ లేదని వివరించారు. సాధువులు, మహర్షులు దేశ ఆధ్యాత్మికతను బలోపేతం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికతే భారత్ బలమన్న ఏపీజే అబ్దుల్ కలామ్ మాటలను ఆయన గుర్తు చేశారు. వైఎస్ఎస్‌ను స్థాపించిన యోగి పరమహంస స్మారకార్థం పోస్టల్ స్టాంపును మోదీ విడుదల చేశారు.

### 4000 మెడికల్ పీజీ సీట్లు సృష్టించాం

సూరత్: దేశంలో వైద్య విద్యను సంస్కరించామని, వైద్య కళాశాలల్లో కొత్తగా 4000 పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లను సృష్టించామని ప్రధాని మోదీ వెల్లడించారు. దేశవ్యాప్తంగా లక్షలాదిగా డాక్టర్ల కొరత ఉందని, ఆ సమస్యను ఈ నిర్ణయం పరిష్కరిస్తుందని తెలిపారు. సూరత్ వచ్చిన ఆయన, విమానాశ్రయంలో వైద్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ స్థాయిలో వైద్య సేవలు అందుతాయని, కొత్తగా ప్రొఫెసర్లు కూడా తయారవుతారని తెలిపారు.